శాస్త్రి:—ఇంకా కల్యాణతారేవిటి రోజులు మారిపోతేను? సంతాన కారంటే యోగ్యంగా ఉంటుంది!

భర్త:—ఓశేవ్, అబ్బాయి నాపోలీకే సుమీ!

భార్య:—నయమే! నాకడుపున పుడితే మధ్య మీపోలి కెలావచ్చింది?

భర్త:—హాసి నీయిల్లు వల్లకాదుగానూ నాప్రయోజకత్వ మేమీ లేనట్టే!

రామయ్య:—ఆగేద్దూడెవర్ది?

వెంకయ్య:—మాదే

రామయ్య:—మీ యింట్లో ఆవుంటే గేద్దూడెలా వచ్చింది?

వెంకయ్య:—అసలు ఓంప్రథమంలో అది ఆవుదూడగానే పుట్టింది. కాని, ఉన్నట్టుండి గేద్దూడై పోయింది!

శాంత:—మా వారికి నేనంటే చాలాఆపేక్ష. ఎప్పుడూ నెత్తిమీద కూచోబెట్టుకుంటారు.

సుశీల:—ఓస్సి, ఇంతేనా! మావారు నన్ను ఒళ్ళోనే కూచోబెట్టుకుంటారు!

మల్లయ్య:—తాతగారూ, తమకి సంతానవెం ఒరు?

తాతగారు:—నాకిప్పుడెనభై యేళ్లు, గర్భాదానం ఇరవై యేళ్ళప్పుడయింది. ఇరవై మొదలు ముప్ఫయివరకూ నాలుకిద్దరు, ముప్ఫయి మొదలు నలభైవరకూ రెండేళ్ళకి ముగ్గురు, నలభై మొదలు నలభైయైదు వరకు హంసపాద. నలభైయైదు మొదలు అరవై వరకు మూడేళ్ళకిద్దరు. అరవై మొదలు డభై వరకు రెండేళ్ళకొక్కరు డభై మొదలిప్పటివరకూ ఫుల్ స్టాపు. మొత్తం లెక్క చూస్కో!

రామయ్య:—మీ అబ్బాయి గ్రాడ్యుయేటుగాదు?

కృష్ణయ్య:—అవునండి.

రామయ్య:—ఇప్పుడేం చేస్తున్నాడు?

కృష్ణయ్య:—అత్తవారింట్లో ఇల్లరికం ఉన్నాడు!

---

## ఆతిథ్యం.

అత్తిలి రాజగోపాలరావు.

నారాయణరావుపంతులు కోర్టులో అడుగుపెట్టాడంటే దడదడలాడనివారు సాధారణంగా ఉండరు. అంతపకడుగా చేస్తాడు మేజస్ట్రేటుగిరీ. ఊళ్లోపులి. ఇంట్లోపిల్లి. ఏనక్షత్రాన్ని ఇంట్లో పాదంపెట్టిందోకాని, ఆయన భార్య కమలమ్మ ఇంట్లో సర్వాధికారం చెలాయిస్తోంది. ఏభై యేళ్ళు పడిదాటినా, ఇప్పటికీ పంతులు ఆవిడపేరు చెప్పినట్టైతే గడగడలాడుతాడు. ఆయనేకాదు, కొడుకు రంగారావు సహితం, ఇద్దరుపిల్లలతండ్రి అయినా, ఆవిడ ఉమ్మేసి దాటవద్దంటే, అంతే.

కోర్టులో కేసు గెలవాలని ప్లీడర్లుగాని, పార్టీలుగాని, కోరుకొన్నారా, పంతులుగార్ని ఎంత ప్రాధేయపడినా లాభంలేదు. ఆయన ప్రాంతానికేనా పోవడానికి గాభరా అయిపోయేవారు. సువర్ణ పుష్పాలతో కమలమ్మగారిని దర్శించారా కార్యసిద్ధి అయిందన్నమాటే. ఆయన అధికారమేముంది. ఆవిడ తన అధికారబలం చలాయించి నలుబదివేల రూపాయిలు వడ్డీకి తిప్పుతోంది. ఒకపర్యాయం ఒకపెద్దమనిషి ఐదువేల రూపాయలు అప్పుపుచ్చుకొని కాళ్లుచాపాడు. అమాంతం

గా అంతసొమ్ముపోవడం ఎలక్ట్రిక్ షాక్ తగిలినట్లయిందామెకు. ఊరుకుందా? రెండునెలలలో, ఏ బాపతునైనా తేనేం. వడ్డీతోసహా ఏడువేల రూపాయిలు గణించినదాకా, ఆమె నిద్రపోలేదు.

ఇంతేనగదుసొమ్ము, నాలుగిళ్ల భవంతి, పెద్ద దొడ్డి, తోటలూ, భూములూ, ఎన్నిఉన్నా, ఆమె ఏనాడూ పిల్లికి బిచ్చంపెట్టి ఎరుగదు. పెరట్లోకాసిన కూరగాయలుసహితం, చేదువైనా, బజారులో అమ్మించడమేకాని, ఇరుగు పొరుగువాళ్లకు పెట్టిఎరుగదు. నారాయణరావు స్వతహాగా ధర్మగుణం కలవాడే. కాని, ఏముష్టివానికేనా గుప్పెడు బియ్యం పెట్టాడా, నాలుగు రోజులుదాకా ఇంట్లో ఉండేందుకు అర్హత లేదనే చెప్పొచ్చు. తనపాపాలకు పరిహారంగా ఏస్నేహితులకో, ఏ బ్రాహ్మణులకో నాలుగుమెతుకులు విదుపుదామని నూఉండేది. పాపం!

ఒకనాడు నారాయణరావు సాయంత్రం క్లబ్బుకు వెళ్లేడు స్నేహితులతో పేకాటకుదిగాడు. ఆయన అదృష్టమో, పెళ్లాం జాతకవిశేషమో కాని, రెండు మూడు రూపాయిలైనా గడించకుండా ఎప్పుడూ లేచేవాడుకాడు పేకాటనుంచి. ఏడుగంటలయింది. అప్పటికి అర్ధరూపాయి కన్నా లభించలేదు పంతులుకి. కృష్ణమూర్తి అనేప్లీడరు, తనకు యింట్లో ఐ. సి. యస్. తగిలింది, పోవాలని లేకపోయాడు. పంతులు అతన్ని ఆపి, "ఇంటికి పోయి ఏమిఅవస్త పడతావు? మాయింటికి భోజనానికి రావోయి" అన్నాడు. కృష్ణమూర్తి సరేనని మరల కూర్చున్నాడు. తొమ్మిదిగంటలయింది. ఆట ఆపివేశారు. ఎవళ్ల యిళ్లకు వారు పోయారు. పట్టుపంచతీసుకొని, పంతులుగారింటికి వెడదామని, ఇంటికివెళ్లాడు కృష్ణమూర్తి.

పంతుని ఇంట్లో కమలమ్మ తర్జన భర్జన ప్రారంభించింది.

"ఇంతఆలస్యం చేశారే ఇంట్లో ఎవళ్లకీ నిద్రాహారాలు అక్కర్లేదనుకున్నారేమిటి?"

"ఎప్పుడూ చిల్లరా బల్లరా మాటూనే యుంటావు. ఈవాళేకా, ఆలస్యం? రోజూ ఏడుగంటలు కాకుండానే వస్తూఉన్నాను"

"ఏదోఒకరోజు చాలదూ, ప్రాణాలు తియ్యడానికి?"

"ఈవేళ కృష్ణమూర్తి మనింటికి భోజనానికి వస్తాడు"

"ఎవరు వండి సిద్ధంచేసుకొని కూర్చున్నారు? ఈలాంటి వెఱ్ఱివేషాలు వేయకండి. ఇప్పుడు మళ్లీ వండలేను. లేవండి భోజనానికి"

పంతులు నోరుమాటాడ లేకపోయాడు. ఆయనకు భోజనం పెట్టి, పట్టిగిన్నెలు తోము దగ్గరపారేసి పోయింది కమలమ్మ. 'కృష్ణమూర్తి మొహం, ఎలాగుచూడనురా, భగవంతుడా?' అని లోపలకుపోయి పడుకున్నాడు పంతులు. వీధితలుపు చప్పుడు. పంతులుగుండె దడదడ. గుమ్మంలోనుంచి ఇలామాటలు వినబడుతున్నాయి.

"పంతులుగారూ!"

"పడుకున్నారండీ!"

"భోజనమయిందా?"

"ఆ!"

"కృష్ణమూర్తి వచ్చి వెళ్లాడని చెప్పండి."

పాప! ఆరాత్రి అప్రతిష్టకై పంతులుపడ్డ బాధకన్నా ఆకలితో కృష్ణమూర్తి అవస్త చెప్పాలి! ఏహోటలుకన్నా పోదామనుకొన్నా, ఉండవుకా అంతరాత్రివేళ! ఉభయ భ్రష్టత్వం అయిందతని పని.

ఇంట్లో భార్యాతత్వం తెలిసినా, తన గౌరవ ప్రతిష్టలు నిలుపుకొందామని, అప్పుడప్పుడు

మాటవరుసకు, మిత్రులను ఇంటికి పిలిచేవాడు. ఆయనసంగతి తెలిసినవారు, "మీయింట్లో వంటమనిషైనాలేదుకదా, ఎందుకు మీఆవిణ్ణి బాధపెట్టడం?" అని తప్పించుకొనేవారు. కాని ఎవరైనా తెలియక ఒప్పుకొన్నారా, ఆనాడు వాళ్లయిద్దరికీకర్మం కాలిందన్నమాటే.

ఒకనాడు కార్యాంతరంమీద, గుంటూరునుండి శ్రీనివాసరావుగారు ఆఊరువచ్చారు. గుంటూరులో ఆయన డెప్యూటీకలెక్టరుగాఉన్నారు. బాల్యస్నేహితుడుకదా అని ఆయన్ని చూడ్డానికెళ్లాడు పంతులు. శ్రీనివాసరావుగారితో పనిఉండి, ఊళ్లోపెద్దమనుష్యులు నలుగు రైదుగురు వచ్చారు. తనయింటికి భోజనానికంటే, తమయింటికి భోజనానికన్నారు వాళ్లు. తానుకూడా పిలవకపోతే మర్యాదగా ఉండదని, పిలిచాడు పంతులుకూడా. బాల్యస్నేహితుడుకదా అని, అతనిమాట తోసివేయలేక, ఒప్పుకొన్నాడు శ్రీనివాసరావు. పాప! అతనికేం తెలుసు పంతులు యింట్లోగొడవ. "ఎందుకు పిలిచానురా భగవంతుడా?" అని పంతులు కొంచెం బిక్కమొగం వేసినా, శ్రీనివాసరావు గ్రహిస్తాడేమోనని సర్దుకొన్నాడు.

పంతులు ఇంటికి వెళ్లాడు. భార్యనుపిలిచాడు. "గుంటూరునుంచి శ్రీనివాసరావుగారు వచ్చారే"

"వస్తే?

"ఆయన ఎంతమంచివాడనుకొన్నావు. నాకు బాల్యస్నేహితుడు. గుంటూరులో డెప్యూటీకలెక్టరుగా ఉన్నాడు"

"ఊఁ. మీకు చాలామంది స్నేహితులు ఉంటారు. వాళ్లు డెప్యూటీకలెక్టర్లు అవుతారు. డిస్ట్రిక్టుజడ్జులూఅవుతారు. మనకర్మంమాత్రం ఎప్పుడూ యింతే. ఎన్నాళ్లుపడిసినా ఈమేజస్ట్రేటుగిరియేగా?"

తనూ పెళ్లాంచేసినపనులకు ఉద్యోగం ఇంకా నిలిచింది అదే పదివేలనుకున్నాడు పంతులు.

"ఆయన్ని వేళ భోజనానికి పిలిచానే."

"ఎప్పుడూ ఎవళ్లనో ఒకళ్లని నాపీకలమీద కెక్కించడమే. ఇంట్లో వంటబ్రాహ్మణుడైనా లేడు. పంచాకరీచేసికొన్నా నేనే చేసికోవాలి."

"వంటబ్రాహ్మణ్ణి పెట్టుకోవద్దన్నానా?"

"ఈసంపాదనకి వంటబ్రాహ్మణుకూడాను!"

"పదిగంటలకల్లా ఆయనవస్తాడే. పిలిచాక అభాసయిపోదూ?"

"ఇలాంటి ఘటాలికందరికీ, ఒక ధర్మసత్రమైనా వేయించకపోయారా? నేను అవసపడలేను. తొమ్మిదిగంటలకల్లా భోంచేసి, కోర్టుకు వెళ్లిపోండి. మిగిలినసంగతి నేనుచూచుకొంటా."

పంతులు భోజనంచేసి కోర్టుకు బయలుదేరాడు. కమలమ్మ తాంబూలంయిస్తూ "ఇక ఎప్పుడైనా ఎవరినైనా భోజనానికి పిలిచారంటే, ఆవచ్చే అతిథిఖర్చుమీద, ఇద్దరూ హోటలుకు పోవలసి వస్తుంది" పంతులు అన్నవదనంతో కోర్టుకు వెళ్లిపోయాడు. పదిగంటలకల్లా శ్రీనివాసరావుగారు వచ్చారు, పంతులు మనుమడు, ఆరుఏళ్లకుర్రాడు వాకిట్లో ఆడుకొంటూన్నాడు.

"అబ్బాయీ! నారాయణరావుగారు నీకేమవుతారు?"

"తాత"

"ఇంట్లో ఉన్నారా?"

"భోంచేసి కోర్టుకు వెళ్లారు"

"ఇంతవేగం వెళ్లిపోయారేం?"

"మాబామ్మ వెళ్లమంది. అందుచేత ముందే వెళ్లాడు"

శ్రీనివాసరావు సంగతంతా గ్రహించాడు. మిత్రుని గతికినవ్వూ, జాలీ కూడా వచ్చాయి. "ఇలాంటి అన్నదాతలుంటే, భారతదేశానికి లోటేమిటి?" అనుకుంటూ హోటలుదారిపట్టాడు.